నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
సోమవారం 26 జూన్ 2023

## కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి : ముదిరాజ్‌ల డిమాండ్

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ముదిరాజ్ కులంపై ఇష్టం వచ్చినట్లు భూతులు మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి వెంటనే ముదిరాజ్‌లకు వెంటనే క్షమాపణ చెప్పాలని ఎల్లారెడ్డి ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఆదివారం ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి ముదిరాజ్ మహా సభా అధ్యక్షుడు బట్టు విట్టల్ మాట్లాడుతూ ముదిరాజ్ జాతి పై అనుచిత వ్యాఖ్యలు చేసి ముదిరాజ్ జర్నలిస్ట్ అజయ్‌ను అకారణంగా కొట్టడాన్ని తీవ్రంగా తప్పు బట్టారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి వెంటనే ముదిరాజ్ లకు క్షమాపణ చెప్పాలని అలాగే బి ఆర్ ఎస్ ప్రభుత్వం స్పందించి అతనిని వెంటనే ఎమ్మెల్సీ నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పాడి కౌశిక్ రెడ్డి ని బర్తరఫ్ చేసే వరకు ఉద్యమిస్తమాని అన్నారు. ఈ కార్యక్రమంలో బైండ్ల పోచన్న ముదిరాజ్, ప్యాలల రాములు ముదిరాజ్, మర్రి బాలయ్య ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, పాండు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామదేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం

**నవతెలంగాణ-ముప్కాల్**

ముప్కాల్ గ్రామాభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామదేవతలకు గంగానీళ్లు (గోదావరి నీళ్ల) తో జలాభిషేకం నిర్వహించినట్టు గ్రామాభివద్ధి కమిటీ అధ్యక్షుడు ఎర్రోళ్ల విజయ్ తెలిపారు. వర్షాలు సంవద్ధిగా కురియాలని, పంటలు బాగా పండాలని కోరుతూ గ్రామ ప్రజలు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ బ్రమ్మదండి సువర్ణ లింగం, గ్రామాభివద్ధి కమిటీ సభ్యులు, ఆయా కుల సంఘాల పెద్దలు, గ్రామస్తులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం.. పేదలకు చేరుతలే

- గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఇల్లు కట్టివ్వాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలి
- ప్రజా సంఘాల పోరాట ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య డిమాండ్
- బస్సుయాత్రకు జంగంపల్లిలో ఘన స్వాగతం


సభలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

**నవతెలంగాణ-భిక్కనూర్**

తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాయ మాటలతో కల్లబొల్లి మాటలతో కథలు చెప్పుతూ కాలం వెళ్లదీస్తుంది తప్ప ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదని ప్రజా సంఘాల పోరాట ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య అన్నారు. ఆర్భాటంగా ప్రారంభిస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు చేరడం లేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలందరికీ కూడు గూడు నీడనివ్వాలని నాలుగు డిమాండ్లతోటి గుడిసెలు వేసుకున్న వారికి ఇల్లు నిర్మాణం చేయాలని ప్రజా సంఘాల పోరా ఐక్య వైదిక ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర శనివారం రాత్రి భిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు జంగంపల్లి భూ సాధన సమితి సభ్యులు యాత్ర బృందానికి బస్టాండ్ ఆవరణలో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ర్యాలీ అనంతరం చాకలి ఐలమ్మ, వివేకానంద, మాత్మ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి మల్లు స్వరాజ్యం కాలనీలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రజా సంఘాల పోరాటైక్యవేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ పైకి బాగానే ఉన్నా ఏ ఒక్క లబ్ధిదారునికి చేరే అవకాశమే లేదని, తెలంగాణ ప్రభుత్వం పేదరికం చూసి నవ్వడం తప్ప పేదలను ఆదుకునే పరిస్థితి లేదన్నారు. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ. పది లక్షలు.. మొత్తంగా రూ.15 లక్షలు ఇంటిని నిర్మించుకునేందుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం మల్లు లక్ష్మి మాట్లాడుతూ నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా తుపాకీ బట్టి పోరాటం చేసిన మల్లు స్వరాజ్యం పేరు పెట్టుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జంగంపల్లి పేద ప్రజలను అభినందించారు. ఆమె పోరాట స్ఫూర్తితో ఉద్యమం ముందుకు కొనసాగించాలని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టీ సాగర్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రావు, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చంద్రశేఖర్, వెంకట్ గౌడ్, అరుణ్, రాజనర్సు, స్థానిక మండల నాయకులు అర్జున్, ప్రవీణ్, పేరం నర్సవ్వ, బాలమణి, చంద్రకళ, లక్ష్మీ శ్యామల, కవిత, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.



డప్పు చప్పుళ్లతో ర్యాలీగా బస్సుయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న స్థానికులు..




# ఏరువాక షురూ..

- తొలకరి పలకరింపుతో సాగుకు సన్నద్ధం
- ఆరుతడి పంటల విత్తనాలు విత్తుకుంటున్న రైతులు
- బోరుబావులున్న చోట నారుమళ్లు సిద్ధం

**నవతెలంగాణ-లింగంపేట్**

తొలకరి పలకరింపు ఆలస్యంగా పలకరించినప్పటికీ.. ఎట్టకేలకు రైతులు సాగు పనులు మొదలు పెట్టారు. రుతుపవనాలు మూడు వారాలు ఆలస్యంగా ప్రవేశించడంతో రెండు రోజులుగా జిల్లాలో చిరుజల్లులు కురుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వర్షాధార పంటలపై ఆధారపడిన రైతులు విత్తనాలు వేస్తున్నారు. వరి పంటలు సాగు చేసే రైతులు ఇప్పటికే బోరుబోవుల వద్ద వరి నారు మళ్లు వేశారు. దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. తొలకరి జల్లులు పలకరించడంతో అన్నదాతలు విత్తనాలు వేసుకుంటున్నారు.

ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లా వ్యాప్తంగా 5, లక్ష 36వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని అధికారుల అంచనా వేశారు. ఇందులో 2 లక్షల 48 వేల 151 ఎకరాలలో వరి పంట సాగు కానున్నట్టు వెల్లడించారు. అంతేకాకుండా వర్షాధార పంటలైన మొక్కజొన్న 86. 2005 ఎకరాలలో పత్తి 73,545 ఎకరాలలో సోయాబీన్ 72,878 ఎకరాలు, కందులు 22,150 ఎకరాల్లో పెసర్లు 10,900 ఎకరాలలో మినుము 10,500 ఎకరాలు చెరుకు 4,100 ఎకరాలు జొన్న 300 ఎకరాలు కుసుమ ఆముదము అంతర్ పంటలు సాగు కానున్నట్టు ప్రణాళికలు రూపొందించారు.

**సిద్ధంగా ఉన్న ఎరువులు**

పంటల సాగుకు ప్రణాళికకు అనుగుణంగా ఎరువులను సిద్ధంగా ఉంచినట్టు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 93 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ప్రస్తుతం 67 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. కాంప్లెక్స్ 26,371 మెట్రిక్ టన్నులు, డిఎపి 6537 మెట్రిక్ టన్నులకు గాను.. కాంప్లెక్స్ 4969 మెట్రిక్ టన్నులు, డిఏపి 1767 మెట్రిక్ టన్నులు ఎస్‌ఓపి 260 మెట్రిక్ టన్నులు రైతులకు అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు.

## నేటి నుండి ఎంసెట్ కౌన్సెలింగ్

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశానికి సంబంధించిన (ఎంసెట్ -2023) ఎంసెట్ (ఎం.పి.సి.) కౌన్సిలింగ్ ప్రక్రియ నేటి(సోమవారం) నుంచి ప్రారంభమౌతుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుకింగ్ సర్టిఫికేట్ ధ్రువీకరణ కోసం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు, సర్టిఫికేటి ధృవీకరణకు హాజరు కావడానికి తేది, సమయం, ఆన్‌లైన్‌లో ఎంపిక తేదీలు ఈ నెల 26 నుండి జులై 5 వరకు ఉంటుందని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్ ధృవీకరణ ఈ నెల 28 నుండి జులై 6 వరకు ఉంటుందని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరవుతున్న విద్యార్థులు ఎంసెట్ (ఎంపిసి) ర్యాంకు కార్డు, ఎంసెట్ హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికేటు, 6వ తరగతి నుండి ఇంటర్ వరకు సంబంధించిన బోనఫైడ్ (స్టడీ సర్టిఫికేట్), టి.సి., ఇన్కం, ఈడబ్ల్యుఎస్, క్యాస్ట్ సర్టిఫికేట్లు హెల్ప్ లైన్ సెంటర్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ రోజు తీసుకురావాలని తెలిపారు. సర్టిఫికేట్ ధృవీకరణ తర్వాత కాళాశాలల, కోర్సుల ఎంపిక (ఆన్లైన్) ఈ నెల 28 నుండి జులై 8 వరకు ఉంటుందని, జులై 12 న సీట్ల కేటాయింపు చేపట్టనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంసెట్ వెబ్‌సైట్‌ను https://tseamcet.nic.in ను సంప్రదించాలని సూచించారు.

## నేడు ఉచిత మెడికల్ క్యాంపు

**అర్సపల్లి, నాగారంలో రేపు, ఎల్లుండి : మల్లుస్వరాజ్యం ట్రస్ట్**

**నవతెలంగాణ-కంఠేశ్వర్**


నగరంలోని నాందేవ్‌వాడలోని మల్లుస్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ భవనంలో (సీపీఐ(ఎం) కార్యాలయం సమీపంలో) నేడు(సోమవారం) ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్‌కార్యదర్శి రామ్మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సిఐఆర్‌సి గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ ఎస్ అండ్ టెక్నాలజీస్ వారి సహకారంతో నిర్వహించనున్నట్టు తెలిపారు. షుగర్, బీపీ, క్యాన్సర్, మెమోగ్రఫి, ఈసీజీ, తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించి వైద్య చికిత్సలు అందించనున్నట్టు తెలిపారు. వీటితో పాటు గడ్డలు (కంతులు) ఏర్పడడం (లేదా) శరీరంలోని ఏ భాగంలోనైనా (రొమ్ములలో) గడ్డలు, కొత్త (పుట్టు) మచ్చలు (లేదా) ప్రస్తుతం ఉన్న అసలు (లేదా) మచ్చలలో మార్పులు, చికిత్సకు మానని పుండు, గొంతులో గరగర, ఎప్పటికి ఉండే పొడి దగ్గు, మల, మూత్ర విసర్జన అలవాట్లలో మార్పులు, విడవకుండా ఉంటున్న అజీర్తి మింగడంలో ఇబ్బంది తదితర సమస్యలున్న వారికి వైద్య శిబిరంలో పరీక్షించనున్నట్టు తెలిపారు.

**రేపు, ఎల్లుండి..**

నగరంలోని అర్సపల్లిలో మంగళవారం (27వ తేదీ)న, నాగారంలోని బహుజన కాలనీలో బుధవారం(28వ) తేదీన వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వైద్య శిబిరాలు ఉదయం 9 గంటల నుంచి కొనసాగనున్నట్టు తెలిపారు. కావున నగర వాసులు వినియోగించుకోవాలని సూచించారు.

## ఐదుగురిపై పిచ్చికుక్కల దాడి

- స్వైర విహారం చేస్తుండటంతో భయాందోళన


పిచ్చి కుక్కల దాడిలో గాయపడ్డ పిల్లలు, పెద్దలు

**నవతెలంగాణ-మద్నూర్**

మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. ఏకంగా ఐదుగురిపై దాడి చేసి గాయపరిచాయి. దీనితో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో కుక్కల బెడద అధికమైందని ప్రజలకు కుక్కలు బెడద నుండి హాని జరిగే విధంగా ఉన్నాయని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుక్కల స్వైర విహారంతో ఇంటి బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. ఇప్పటికైనా జీపీ అధికారులు, పాలకులు స్పందించి కుక్కలను ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

# బ్రిడ్జిల నిర్మాణాలకు అధునాతన టెక్నాలజీ

- నీటి విడుదలకు ఇబ్బంది లేకుండానే కాలువలపై పనులు
- మరో రెండు నెలల్లో పూర్తి చేస్తాం
- పనులు పరిశీలించిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



కాలువలపై చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి వేముల, స్థానిక ప్రజాప్రతినిధులు

**నవతెలంగాణ-మెండోరా**

అధునాతన టెక్నాలజీతో కాకతీయ కాలువ మీద బ్రిడ్జిలు నిర్మిస్తున్నామని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో కాలువ నీరు ఆపకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపడుతున్నట్టు తెలిపారు. మెండోరా మండలం సోన్ పేట్ - పోచంపాడ్ గ్రామాల మధ్య కాకతీయ కెనాల్ జీరో పాయింట్ వద్ద 1.24 కోట్ల వ్యయంతో, మెండోరా-దూద్ గాం వద్ద కాకతీయ కెనాల్ పై 1.38 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జ్ నిర్మాణ పనులను ఆదివారం వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు.

గతంలో ఈ ఒక్కో బ్రిడ్జ్ నిర్మాణం కోసం సుమారు 90 లక్షల వరకు మంజూరు చేశామని కానీ నీరు పారుతున్న సమయంలో సెంట్రింగ్ వేసి బ్రిడ్జిలు నిర్మించుకోవడం సాధ్యం కాలేదని అన్నారు. 'ఎండాకాలం సమయంలో కూడా బాల్కొండ నియోజకవర్గ రైతులు మక్క, సజ్జ, పసుపు, నువ్వులు లాంటి పంటలు వేస్తారు. వాటికి కాకతీయ కెనాల్ నీళ్లు అవసరం. కెనాల్‌లో నీళ్ళు ఆపకుంటే బ్రిడ్జ్‌ల నిర్మాణ పనులు సాగట్లేదు. నీళ్ల ఆపితే నియోజకవర్గ రైతులకు ఇబ్బంది అవుతుంది. బ్రిడ్జి నిర్మాణాల వల్ల నాలుగు గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. దాని కోసం ఆలోచన చేస్తుండగా అధునాత టెక్నాలజీతో సెంట్రింగ్ లేకుండా భీములు, స్లాబ్ వేసే అవకాశం ఉన్నదని ఇంజనీర్ అధికారులు దృష్టికి తెస్తే ఆ పద్ధతిలోనే చేద్దాసి రైతులకు, ప్రజలకు ఎవరికి ఇబ్బంది లేకుండా బ్రిడ్జి ల నిర్మాణం పూర్తవుతుందని చర్చించాము. అందుకు అదనంగా నిధులు కావాలని అధికారులు అడిగారని, నాలుగు గ్రామాల ప్రజలు, బాల్కొండ రైతుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని సీఎం కేసిఆర్‌కు పరిస్థితిని వివరించి అదనంగా మరో 50 లక్షలు మంజూరు' చేశామని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న ఈ బ్రిడ్జిల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని, నీటి విడుదలకు ఇబ్బంది లేకుండా మరో రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని మంత్రి చెప్పారు. తన విజ్ఞప్తి మేరకు ప్రజలు, రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని నూతన టెక్నాలజీతో బ్రిడ్జ్ నిర్మాణానికి సీఎం కేసిఆర్ అదనంగా నిధులు ఇచ్చారని, నాలుగు గ్రామాల ప్రజలు,బాల్కొండ నియోజకవర్గ రైతాంగం పక్షాన సీఎం కేసిఆర్ గారికి మంత్రి తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మంత్రి వెంట స్థానిక బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్ శేఖర్‌రెడ్డి, ఎంపిపి బురుకల సుకన్య కమలాకర్, వైస్ ఎంపిపి పడాల సరస్వతి రవీందర్ గౌడ్, జడ్పిటిసి తలారి గంగాధర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్లపల్లి అరుణ నవీన్ గౌడ్, గ్రామ సర్పంచ్‌లు మిస్బోద్దీన్, గోలి ప్రకాష్ , ఉప సర్పంచ్ సంపంగి సతీష్, స్థానిక ప్రజాప్రతినిధులు , మండల నాయకులు , రైతులు , బీఆర్ఎస్ కార్యకర్తలు , తదితరులు ఉన్నారు.

# కమీషన్‌ల కోసమే రీడిజైన్‌తో ప్రాజెక్టులు

- రైతులకు సాగునీటిని ఇచ్చే ఉద్దేశం లేదు
- మంచిప్ప ప్రాజెక్టును సందర్శించిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి


పనులు పరిశీలిస్తున్న మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు

**నవతెలంగాణ-మోపాల్**

బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్‌ల కోసం ప్రాజెక్టులను రీడిజైన్ పేరుతో నిధులు పెంచు కుంటూ పనులు చేపడుతోందని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. మంచిప్ప రిజర్వాయర్ పనులు కాంగ్రెస్ హయాంలోనే దాదాపుగా 70 నుండి 80 శాతం పూర్తయిందని అనవసరంగా ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ కాంట్రాక్టర్ల కోసమే పనులు చేపడుతున్నట్టు ఉందని, ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు కమీషన్లు దండుకోవడం తప్ప రైతులకు సాగునీరు అందించే ఉద్దేశం లేదని విమర్శించారు.

మోపాల్ మండల కేంద్రంలో మంచిప్ప ప్రాజెక్ట్‌ను మాజీ మంత్రి పి సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ నాయ కులతో కలిసి ఆదివారం సందర్శిం చారు. పాత డిజైన్ ప్రకారమే పనులను త్వరితగతిన పూర్తి చేయా లని డిమాండ్ చేశారు. ఇక్కడ అధి కారులను సంప్రదించగా 20 ప్యాకేజీ కంప్లీట్ అయిందని 21 ప్యాకేజ్ లో మాత్రం మోటార్లు, పైపులు బిగించాల్సి ఉందని అధికారులు చెప్పినట్టు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రంగానికి చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టును సందర్శించాలనే ఉద్దేశ్యంతో ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. కానీ ఇక్కడి రైతుల బాధతలు చూస్తే ఆవేదన కలుగుతుందని సొంత ఊరి మీద ఉన్న మమకారాన్ని వదులుకోవడం ఎవరికైనా కష్టమే అని అటువంటిది ఊరిని తాను నమ్ముకున్న వ్యవసాయ భూమిని కూడా వదులుకోవడం అది గుండెకు బరువెక్కిన బాధ అని అన్నారు. తాము అధికారం లోకి రాగానే రీడిజైన్ అనే పేరు లేకుండా కేవలం పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు పనులు కొనసాగి స్తామని ప్రతి ఒక్క రైతుని రైతు బిడ్డని ఆదుకుంటా మని ఎవరైతే భూములు కోల్పోయారో వారికి మార్కెట్ రేటుకి అనుగుణంగా పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ భూపతిరెడ్డి, కిసాన్ కెత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, అంతిరెడ్డి రాజిరెడ్డి, తాహెర్ బిన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్ రెడ్డి గిడుగు గంగాధర్ పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

**ఏర్పాటు చేసి ఏడాది పూర్తి : ఎస్ఐ**

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి సంవత్సర కాలం పూర్తి అయిందని ఎస్ఐ గణేష్ తెలిపారు. సిసి కెమెరాలు 15 లక్షల రూపాయల వ్యయంతో అందరి సహకారంతో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సంవత్సర కాలంలో సుమారు కోటి రూపాయల విలువైన దొంగతనాలను అరికట్టామని బైక్ ఆక్సిడెంట్ తదితర వాటిని గుర్తించి ఎప్పటికప్పుడు నేరాలు జరుగకుండా సిసి కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఇప్పటికీ సీసీ కెమెరాలు పని చేస్తున్నాయని నిరంతరం పోలీస్ స్టేషన్ నుండి పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట్ మండలం లింగంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనుమల సాయిలు తమ్ముడి భార్య అకస్మాత్తుగా అనారోగ్యంతో గత నాలుగు రోజుకితం మృతి చెందింది. లింగంపల్లి గ్రామానికి చెందిన హనుమల సురేందర్ భార్య రంజిత అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆదివారం వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కొత్త పోచయ్య సాయిరాం యాదవ్ సాయన్న గ్రామస్తులు ఉన్నారు.

## ఒకే దఫా రుణమాఫీ చేయాలి

- రైతులకు కొత్త రుణాలూ మంజూరు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్



మాట్లాడుతున్న సాగర్

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

రైతులకు ఒకే విడుతలో రుణమాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ డిమాండ్ చేశారు. నగరంలోని నాందేవ్‌వాడలో రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఒకేసారి రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన 9 సంవత్సరాలు గడిచిపోతున్నప్పటికీ రుణ మాఫీ కాకపోవడంతో బ్యాంకులవారు వడ్డీలకు వడ్డీ వేసి రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు.

వివరాలు మెయిన్‌లో..

## కరోనా సమయంలో వైద్య సిబ్బంది సేవలు వెలకట్టనివి

- జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు


డీఎంఅండ్‌హెచ్‌వోను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా కరోనా బాధితులకు వైద్య సిబ్బంది అందించిన సేవలు వెల కట్టలేనివని, ఆ రోజులను తలచుకుంటే భయమేస్తుందని, అంత భయంకరంగా ఉన్నప్పుడు ఎందరికో ప్రాణం పోశారని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని సాంపల్లి గ్రామంలో ఐఎంఎ నిజామాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం పదా.. కార్యక్రమంలో భాగంగా రూరల్ మెగా హెల్త్ క్యాంపు ప్రారంభోత్సవనికి జడ్పీ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. కరోనా సమయంలో తమ కుటుంబాలను లెక్క చేయకుండా కరోనా బారిన పడిన వారిని ఎంతోమందిని రక్షించారని గుర్తు చేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఐఎంఎ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యరంగానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించి ప్రజల ప్రాణాలను కాపాడుతున్న ఘనత సిఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ప్రధానంగా విద్యా వైద్యానికి సిఎం కెసిఆర్ పెద్దపీత వేశారన్నారు. గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుదర్శనం, ఐఎంఎ జిల్లా అధ్యక్షులు రాంచందర్, ప్రధాన కార్యదర్శి జలగం తిరుపతిరావు, కోశాధికారి రాజేంద్రప్రసాద్, వైద్యులు డాక్టర్ జీవన్ రెడ్డి, నరేంద్ర, కవితారెడ్డి, సుజాత, నాగమోహన్, సుభాష్, సాయిపవన్, పాండ్యన్, అరవింద్, అశోక్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు అంజనేయులు, సభ్యులు రాజశేఖర్,మండల రెడ్ క్రాస్ అధ్యక్షులు డాక్టర్ రవివర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చింత శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మోహన్ రెడ్డి, ఉపసర్పంచ్ మోహన్, సాంపల్లి తండా సర్పంచ్ జగదీష్, సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణలతో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 5లక్షల చెక్కు అందజేత



**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

ఇందల్ వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామానికి చెందిన శంకర్ గౌడ్ భార్య లక్ష్మికి 5 ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేసినట్టు ఇందల్ వాయి మాజీ ఎంపిటిసి రామగౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ లోని కోకాపేటలో గౌడ్ భవన్ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా గత కొన్ని రోజుల క్రితం తాటిచెట్టు పై నుండి పడి మృతి చెందిన శంకర్‌గౌడ్ భార్య లక్ష్మికి ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సమక్షంలో డిపిఈఓ కె.మల్లారెడ్డి నిజామాబాద్ చెక్కును అందజేసినట్లు చెప్పారు.

## సర్పంచ్ ఫిర్యాదుతో ఇంచార్జ్ హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు?

**నవతెలంగాణ-వేల్పూర్**

వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యా యుడు విజయ్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. స్కూల్ డ్రెస్సుల కోం విద్యార్థుల ఒక్కొక్కరి నుండి రూ.340 చొప్పున వసూలుకు పాల్పడ్డారని పడగల్ గ్రామ సర్పంచ్ ఫిర్యాదు ఇవ్వడంతో సస్పెన్స్ వేటు పడింది. అయితే దుస్తుల కుట్టుకూలీ సరిపోక కొంత మొత్తంలో విద్యార్థుల నుండి నగదు స్వీకరించినట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం తెలిపారు. ఇది పాఠశాల నిర్వహణ కమిటీ సమక్షంలోనే తీసుకున్నానని తెలిపారు. దీంతో పాటు నేడు ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం.

# 152 మందిపై ఉపా కేసును ఎత్తివేయాలి

**●రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్**

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**


ప్రొ. హరగోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆల్గోట్ రవీందర్ సహా 152మందిపై పెట్టిన ఉపా కేసును వెంటనే ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ వక్తలు డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అధ్యక్షత వహించారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు నర్ర రామారావు, సిఎల్సి జిల్లా అధ్యక్షులు ముప్వా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి కే. రామ్మోహన్ రావు, బిఎస్పీ నాయకులు ఎడ్ల రాము, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్ తదితరులు మాట్లాడారు.

2022 ఆగస్టు 19న ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో ప్రొఫెసర్ హరగోపాల్, కాశీం, ఆల్గోట్ రవీందర్ తదితరులు 152 మందిపై దేశద్రోహం కేసులు నమోదు చేశారన్నారు. సమాజంలో గౌరవం వున్న వ్యక్తులకు మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలు చేసి దేశద్రోహం కేసును బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ఈ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యలపై గొంతెత్తిన వారిపై దేశద్రోహం చట్టం కింద జైళ్లల్లో పెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడుతు న్నామని దశాబ్ది ఉత్సవాల్లో ప్రకటించుకున్న రాష్ట్ర ప్రభుత్వం వామపక్ష వాదులను, మేధావులను, ప్రజా సంఘాల నాయకులను టార్గెట్ చేసి, వారిపై కేసులు బనాయించడం అత్యంత దుర్మార్గమన్నారు. వామపక్షాలు, ప్రశ్నించే గొంతులు ఉండడం వల్లనే నేడు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కొనసాగు తున్నదని అన్నారు. వామ పక్షాలను, మేధావులను, ప్రజాసంఘాలను అణచి వేయడ మంటే ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని అణచివేయడమే అవుతుందన్నారు. రాష్ట్రంలో అమలౌతున్న ఉపా చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉపా కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ అన్ని పార్టీలు ప్రజాసంఘాలుగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో ఎఐపికెఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సాయగౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య, ప్రజాసంఘాల నాయకులు జలెందర్, భాస్కరస్వామి, నారాయణ, అరవింద్, కిరణ్, లింగం, రాజు, సందీప్, మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది హనుమంతరావు



**నవతెలంగాణ-బోధన్**

తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది హనుమంతరావును ఎన్నుకున్నట్టు ఆదివారం ఆయన తెలిపారు. నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పూర్తిస్థాయి కమిటీని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించినట్టు పేర్కొన్నారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న హనుమంతరావును తిరిగి ప్రధాన కార్యదర్శిగా నియమించారని తెలిపారు. పార్టీని సంస్థాగతంగా బలపరుస్తానని అలాగే తనకిచ్చిన బాధ్యతలను పూర్తిగా న్యాయం చేస్తానని పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సీఐటీయూ

**నవతెలంగాణ-ఎడపల్లి**

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని ఈనెల 26వన కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ ఒనిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు జంగం గంగాధర్ తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న వాటర్ మెన్, కారోబార్, సీపర్స్, డ్రైవర్లు, ఎలక్ట్రిషియన్, ఇతర సిబ్బంది హాజరు కావాలని కోరారు. తిలక్ గార్డెన్ నుండి జేఏసీ ర్యాలీ బయలుదేరుతుందని తెలిపారు. పంచాయతీ కార్మికుల సమస్య పరిష్కారం చేయనందున జులై 6నుండి రాష్ట్రవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్టు హెచ్చరించిన ప్రభుత్వం పట్టించుకోనందున సమ్మెలోకి వెళ్లనున్నట్టు తెలిపారు. మండల జేఏసీ నాయకులు గంగారాజు, రైమత్, సంతు, భూమవ్వ, పద్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జంగం గంగాధర్

## డివి కృష్ణ ప్రథమ వర్ధంతి వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

**నవతెలంగాణ-రెంజల్**

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న డివి కృష్ణ ప్రథమ వర్ధంతికి సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని నాయకులు తుమ్మల గంగాధర్ ఎస్కే నసీర్లు కోరారు. ఆదివారం సిల్దార్ కార్యాలయం సమీపంలో వర్ధంతి సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డివి కృష్ణ తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పుట్టినడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్, వడ్డెన్న, పెద్దలు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి మార్కండేయ సంఘం ఆలూర్ కార్యవర్గం ఎన్నిక

**నవతెలంగాణ-ఆర్మూర్**

నూతన ఆలూరు మండల పద్మశాలి మార్కండేయ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చిలుక జ్ఞానేశ్వర్, కార్యనిర్వహణ అధ్యక్షునిగా బత్తుల హరి, ఉపాధ్యక్షులుగా బొడ్డు గంగాధర్, బింగి సాయిలు ప్రధాన కార్యదర్శిగా దాసరి రథ స్వామి, కోశాధికారిగా శ్రీనివాస్, సలహాదారుడుగా నారాయణ, రాజేశ్వర్ అశోక్, గంగాధర్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అంబల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పట్టణ మేరు సంఘం ఎన్నిక

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణ మేరు సంఘంలో ఆదివారం విశ్రాంత ఉపాధ్యాయులు పుల్కం నారాయణ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా రాజులదేవి రవినాథ్ గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ శుభాకాంక్షలు తెలిపారు.


## అసమర్థ నాయకులకు ఓటుతో గుణపాఠం చెప్పాలి

**●బహుజన సమాజ్ పార్టీ**

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

అసమర్థ నాయకులకు ఓటుతో సరైన గుణపాఠం చెప్పాలని బహుజన సమాజ్ పార్టీ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఇంచార్జి కళా శ్రీనివాస్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం బహుజన్ సమాజ్ పార్టీ రూరల్ నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్ల తెరాస పాలనలోప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. డాక్టర్.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో ప్రజలందరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సిలుముల గణేష్, జిల్లా నాయకులు హరీష్, నియోజకవర్గ అధ్యక్షుడు పోతే ప్రవీణ్, ఉపాధ్యక్షులు జిన్న సంపత్, ప్రధాన కార్యదర్శి నట్ట ఆనంత్, కోశాధికారి విజయ్, ఇందల్వాయి మండల అధ్యక్షులు గుర్రాల ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ రణవీర్, నిజామాబాద్ రూరల్ మండల నాయకులు గంగాధర్, రామరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## హైమాస్ట్ లైట్ల ను ప్రారంభించిన జడ్పీ చైర్మన్


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

మండలంలోని సాంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ చైర్మన్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల ను ఆదివారం జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, సర్పంచ్ మోహన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001లో తెలంగాణ ఉద్యమానికి సాంపల్లి గ్రామం సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, గ్రామంలో ఐక్యతగా ఉంటారని పేర్కొన్నారు. సర్పంచ్ మోహన్ రెడ్డి విజ్ఞప్తి మేరకు హైమాస్ట్ లైట్ల ను మంజూరు మంజూరు చేయటం జరిగిందన్నారు. గ్రామంలో త్వరలోనే 2 లక్షల రూపాయలు సీసీ డ్రైనేజీ నిర్మాణంకోసం మంజూరు చేస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ, ఉపసర్పంచ్ మోహన్, సాంపల్లి తండా సర్పంచ్ జగదీష్, గ్రామ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య సేవలు


వైద్యశిబిరానికి హాజరైన వైద్యులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌లు ఆదివారం లక్కోర, బడా భీంగల్, పిప్రి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి 500 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పట్టణంలోని లైఫ్ హాస్పిటల్, సాయి చందన, నిత్య ఈ ఎన్ టి హాస్పిటల్ వైద్య బృందం వైద్యులు డాక్టర్ భాను రామగిరి, స్రవంతి రెడ్డి, శ్రీకాంత్ లోయ, శైలజ, చైతన్య, మేనేజ్మెంట్ వేణు రామగిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఐఎంఏ వైద్యుల పర్యవేక్షణలో పలు గ్రామాలలో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడానికి సహకరించిన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రకాష్, భాను రామగిరి, కోశాధికారి రాకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


## అసంపూర్తి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీపీకి వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

**నవతెలంగాణ-బోధన్**

సాలూర మండల కేంద్రంలోని మాదిగ దండోర కమ్యూనిటీ హాల్ అసంపూర్తిగా ఉండడంతో దాన్ని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్‌కు ఎంఆర్పిఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. గతంలో ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ కృషితో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ తన నిధులను దండోర సంఘం కమ్యూనిటీ హాల్‌కు 5లక్షల రూపాయలు మంజూరి చేయడంతో కొంత వరకు కంపౌండ్ వాల్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన నిర్మాణం కోసం మరిన్ని నిధులు మంజూరి చేయాలని ఎంఆర్పిఎస్ నాయకులు కోరారు. ఎమ్మెల్యేకు సమస్య వివరించి నిధుల మంజూరికి కృషి చేస్తామని ఎంపీపీ హామీనిచ్చాని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ షకీల్, గ్రామ పెద్దలు వెంకట్ పటేల్, ఎమ్మార్పీఎస్ నాయకులు చంటి, లస్మయ్య లాలయ్య, సుభాష్, సాయిలు, మాదిగ మేధావుల ఫోరం జిల్లా సహాయ కార్యదర్శి లింబూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## రైతు సమస్యలు తెలుసుకున్న మాజీ మంత్రి


మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని దూపల్లి గ్రామాన్ని టీపీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి పి సుదర్శన్ రెడ్డి ఆదివారం సందర్శించి రైతు సమస్యలను తెలుసుకున్నారు. పంట డబ్బులు ఇంతవరకు పడలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దూపల్లి గేటు నుంచి గ్రామం వరకు రోడ్డు అధ్వాన స్థితిలో ఉండటం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వారు తెలిపారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు అర్బన్ ఇన్చార్జి తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ మండల అధ్యక్షులు సాయి రెడ్డి, సిహెచ్ రాములు, జిల్లా మాజీ కార్యదర్శి జావీద్ ఉద్దీన్, కాంగ్రెస్ పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు లచ్చేవారు నితిన్, గియాసుద్దీన్, రాకేష్, నిరెడి గంగాధర్, సిద్ధ సాయిలు, గ్రామస్తులు సోనాలి గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, రవి, ఆకుల హనుమన్లు, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

## వరినారుతో పేరు



వరినారుతో రూపొందించిన పేరు

**నవతెలంగాణ-జుక్రాన్‌పల్లి**

వ్యవసాయం చేసే ప్రతి ఒక్కరికి తెలిసిన వ్యక్తి చిన్ని కృష్ణుడు తన అసలు పేరు నాగుల గంగారం అని ఎవరికీ తెలియదని తన పేరును వరి నారుతో చిత్రీకరించి ప్రజలకు పరిచయం చేశారు. జుక్రాన్‌పల్లి మండలం చింతలూరు గ్రామానికి చెందిన నాగుల గంగారం చిన్నప్పుడు చిన్ని కృష్ణుడి వేషం వేయడంతో గ్రామ ప్రజలందరూ చిన్ని కృష్ణుడిగా పిలిచేవారు. అదేపేరుగా మారింది. తన అసలు పేరును పరిచయం చేసుకోవడం కొరకు 10 రకాల వరి విత్తనాలతో ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క రకమైన వరి విత్తనాన్ని వాడుతూ నాగుల చిన్న గంగారావం అని పేరును వరినారుతో చిత్రీకరించి ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తూ దేశవాళీ వరి విత్తనాలను అమ్ముతూ ప్రజలకు పరిచయమయ్యారు. ఇటీవల వారి తల్లిదండ్రుల పేరు పైన వరి నారుతో వారి తల్లిదండ్రుల ఫోటోలు చిత్రీకరించి ఎన్నో అవార్డులను బహుమతులను పొందారు.

# ప్రపంచాన్ని మార్చే శక్తి యువతకే ఉంది

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

ప్రపంచాన్ని మార్చే శక్తి కేవలం యువతకు ఉందని సీపీఐ(యం-యల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా 8వ మహాసభ నిజామాబాద్ నగరంలోని కోటగల్లీ నీలం రామ చంద్రయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జెండాను జిల్లా అధ్యక్షుడు సుంకరి రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకుల పాపయ్య మాట్లాడుతూ.. దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసం చేసారని, దీంతో నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని తెలిపారు. గుట్కా, మద్యం, అశ్లీల సాహిత్యం, సామ్రాజ్యవాద విష సంస్కృతి వైపు మళ్లి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. యువతను ఏకం చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహాసభల్లో సీపీఐ(యం-యల్) న్యూడెమోక్రసీ నాయకులు దాసు, నీలం సాయిబాబా, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయిరెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి వనమల సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు బండమీద నర్సయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు శ్రీనివాస్, వెంకటేష్ సాయినాథ్, భాస్కర్, దాసు, ప్రజాసంఘాల నాయకులు, పీవైఎల్ కార్యకర్తలు వందమంది పాల్గొన్నారు.


జెండా ఎగురవేస్తున్న నాయకులు రవి

## 2న క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

**నవతెలంగాణ-ఆర్మూర్**

రాష్ట్రవ్యాప్తంగా క్షత్రియ ప్రాంతీయ సమాజ్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్టు శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రియ (పట్కర్/ఖత్రి) ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు విశ్రాంత ఐపీఎస్ విశ్వనాథ్ రవీందర్ తెలిపారు. ముఖ్య కార్యనిర్వహణ అధికారి అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు అంశాలు చర్చించారు. జులై 2 న క్షతియ ప్రాంతీయ సమాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గల క్షతియ విద్యార్థిని విద్యార్థులకు సికింద్రాబాద్‌లోని జీడిమెట్ల వద్ద గల సమాజ్ కార్యాలయంలో ఉత్తమ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ముఖ్య అతిథిగా ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ విచేస్తున్నారని అధ్యక్షులు విశ్వనాథ్ రవీందర్ కోరారు. సమావేశంలో అఖిల భారత ఎస్ ఎస్ కె సమాజ్ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ బాల్ కిషన్, ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణు, ఉపాధ్యక్షులు పూజారి రాజేశ్వర్, అల్జాపూర్ శ్రీనివాస్, గుజరాతీ రాజేశ్వర్, మామిడి పేంటుసా, అశోక్, కోశాధికారి దినేష్ వైద్య, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు పాల్గొన్నారు.


రాష్ట్రకార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు : ఏఐఎస్‌బీ

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/బోధన్**

మొక్కలు నాటితే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చుని ఏఐఎస్‌బి రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్ రెడ్డి అన్నారు. అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) 73 వ వార్షికోత్సవ దినోత్సవ వేడుకలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాస్టల్ వార్డెన్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్బి 1951 జూన్ 25న బెంగాల్ రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. విద్యారంగ సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో విద్యాలయాలు సమస్యలకు నిలయంగా మారాయన్నారు. కేంద్రప్రభుత్వం యూనివర్సిటీల ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అనేక హామీలు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ అమలులో విఫలమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్ ప్రవేట్ విద్యా వ్యవస్థకే ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యాభివృద్ధి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్, కిరణ్, మహేందర్, రవి, రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

**బోధన్:** బోధన్ పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఏఐఎస్‌బీ రాష్ట్ర కమిటీ సభ్యులు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో విద్యార్థులలో జాతీయ భావాలను పెంపొందిస్తూ నేతాజీ చంద్రబోస్ కలలు కన్నా భారతదేశం నిర్మాణంకై ఉద్యమ ఉద్యమాన్ని విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజన్న, సతీష్, శీను, గంగా ప్రసాద్, మోహన్, దిలీప్, జగన్ తదితరులు పాల్గొన్నారు



మొక్కను నాటి నీరుపోస్తూ..

## ఆలయ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని సాటాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న రామ మందిరాన్ని మల్లారం పిట్ల కృష్ణస్వామి ఆదివారం సందర్శించారు. మందిర నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ లచ్చేవారు నితిన్‌ను కోరారు. ఆయన వెంట ఇంజనీర్ శివకాంత్, కోశాధికారి చంద్ర, స్థానికులు దేవయ్య, గోపి ,అనిల్ సాయి గ్రామస్తులు ఉన్నారు.

## గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట మండలంలోని రాంపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్తులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాన్ని సమర్పించి టెంకాయలు కొట్టి ముక్కులు తీర్చుకున్నారు. గ్రామదేవతలైన నల్ల పోచమ్మ ముత్యాల పోచమ్మ పోలేరమ్మ వద్ద పూజలు చేశారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మల్ల యోధులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## దరఖాస్తుల విచారణ

**నవతెలంగాణ-ధర్పల్లి**



రాష్ట్ర ప్రభుత్వం బీసిల కు అందించనున్న లక్ష సహాయానికి వచ్చిన దరఖా స్తులపై అధికారులు విచారణ చేపడుతున్నారు. ఆదివారం సైతం ఎంపిడిఓ లక్ష్మణ్ మండలంలోని హొన్నాజీపేట్ గ్రామంలో దరఖాస్తులు చేసుకున్న కులవత్తుల వారి ఇంటివద్దకు వెళ్లి వారి కుటుంబ స్థితి గతులు, ఇతరాత్ర సేకరించారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## ఇష్టానుసారంగా నిధుల కేటాయింపు

- మాకు సమాచారం ఉంటలే :
- ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు దీన్‌దయాల్

**నవతెలంగాణ-మద్నూర్**



మాట్లాడుతున్న దీన్ దయాల్

ఉమ్మడి మద్నూర్ మండలంలోని నూతనంగా ఏర్పడ్డ డోంగ్లి మండలంలో ఒంటెద్దు పోకడ పటేల్‌తనం, దొరతనం కొనసాగు తుందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు దీన్‌దయాల్ ఆరోపించారు. ఎస్‌డీఎఫ్ రెండు కోట్ల నిధులు ఇష్టానుసారంగా ఎంపీటీసీలకు ఎంపీపీకి జడ్పిటిసికి తెలియకుండానే కేటాయించారని అన్నారు. ఆదివారమిక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమాచారం లేకుండా ఇష్టానుసారంగా నిధులు కేటాయించడం పార్టీకి నష్టం కలిగించడమేనని అన్నారు. ఇలాంటి వ్యవహారంతో పార్టీ నష్టపోతుందని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేకు గెలిపించాలా లేక ఓడించాల పటేల్ తనం దొరతనం పనితీరు చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగించే విధంగా ఉందని అన్నారు. ఇలాంటి వాటి పట్ల ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రత్యేక దృష్టిసారించి పార్టీలో ఎలాంటి విబేధాలు లేకుండా చూడాలని కోరారు. ఎంపీటీసీలకు, ఎంపీపీకి, జడ్పీటీసీకి, పార్టీ నాయకులకు సముచిత స్థానంకల్పించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో వైస్ ఎంపీపీ జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలతో పేరుతో దగా

**నవతెలంగాణ-లింగంపేట్**



మాట్లాడుతున్న రమేశ్

దశాబ్ది ఉత్సవాల పేరుతో సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను దగా చేస్తున్నాడని తెలంగాణ జన సమితి పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ నిజ్జన రమేష్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పేదలకు ఇళ్ళు లేక ఎదురుచూస్తున్నారు. కనీసం డబల్ బెడ్ రూమ్ లు ఇల్లు కట్టిస్తానని మోసం చేశారని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, రైతులకు సాగు నీరు ఇవ్వలేదని ఆరోపించారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని మోసం చేశారని, కొట్లాడితే కొన్ని నోటిఫికేషన్‌లు ఇచ్చి వాటి ఉద్యోగాలను సైతం అమ్ముకున్నారని విమర్శించారు. కెసిఆర్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో టీజేఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పూల్ సింగ్ నాయక్, మండల ఉపాధ్యక్షులు తిర్మలేష్ నాయుడు, కార్యదర్శి పాపాయిల రవి, విజయ్ కుమార్ లు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ పార్ట్ టైం అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి : మంత్రికి వినతి

**నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్**



మంత్రికి వినతిపత్రం అందజేత

వివిధ యూనివర్సిటీలలో పని చేస్తున్న పార్ట్-టైం టీచర్లను రెగ్యులరైజ్ చెయ్యాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీలకు చెందిన పార్ట్ టైం టీచర్స్ కోరారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలోని ఆమె నివాసంలో కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. అన్ని అర్హతలు, అనుభవం ఉండి కూడా ఆరు నెలల జీతమే పొందుతూ అర్ధాకలితో కుటుంబాలను పోషించుకుంటు న్నా మని అనుక్షణ అనేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. పార్ట్ టైం టీచర్స్ ను రెగ్యులరైజ్ చేయడం ద్వారా ఆత్మ గౌరవం, 12 నెలలు జీతాలతో పనిచేస్తారని దానివలన యూనివర్సిటీలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. స్పందించిన మంత్రి.. ఈ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందని, మరోసారి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

# బిల్లు లేదు.. గడువు ఉండదు

- అడ్డగోలుగా.. విత్తనాలు, పురుగుల మందుల విక్రయం
- ఉద్దేర పేర.. అంటగడుతున్న పలువురు వ్యాపారులు
- సీడ్స్, ఫర్టిలైజర్ షాపులపై నిఘా కరువు

**నవతెలంగాణ-భిక్కనూర్**



లైసెన్స్, ప్యాకింగ్, గడువు తేదీ లేకుండానే విత్తన ప్యాకెట్ విక్రయం

తొలకరి పలకరించడంతో వరి నాట్లు, విత్తనాలు వేసుకునేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేసేందుకు సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాలకు రైతులు పరుగులు తీస్తున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లోకి నకిలీ, నాణ్యత లేని, కాలం చెల్లిన విత్తనాల విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేర పేరుతో రైతులకు పలువురు వ్యాపారులు కుచ్చుటోపి పెడుతున్నారు. లైసెన్స్ లేని నకిలీ విత్తనాలతో పాటు కాలం చెల్లినవి రైతులకు అంటగడుతున్నట్టు సమాచారం. అందుకే కొనుగోలుకు సంబంధించిన రసీదులు సైతం రైతులకు ఇవ్వడం లేదు. వ్యవసాయశాఖ అధికారులు సీడ్స్ షాపులపై నిఘా పెట్టాలని రైతులు కోరుతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 100కు పైగా సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులు ఉన్నాయి. సరైన రికార్డులు లేక అధికారుల కళ్ళు కప్పి గుట్టుచప్పుడు కాకుండా రికార్డులో లేని సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్‌ని కూడా రైతులకు విక్రయిస్తున్నారు. రైతులు కొనుగోలు చేసి పంట వేసిన తర్వాత పంట చేతికి రాకపోవడంతో విత్తనాల షాపుల యజమా నులతో వాగ్వా దానికి దిగుతున్నారు. సీడ్స్ షాపు యజమానులు సైతం కంపెనీ ఇచ్చిన విత్తనాన్ని విక్రయించ డమే మా బాధ్యత అని పంట చేతికి రాకపోతే మేము ఏమి చేయమని చేతులు దులుపుకుంటున్నారు.

జిల్లా, మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు మేరకే పంటలు వేయాలని, అధికారుల సలహాలు పాటించి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ మందులను కొనుగోలు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్న, రైతులకు నాణ్యమైన విత్తనాలను సీడ్ షాప్ యజమా నులు విక్రయించాలని అధికారులు సూచిస్తున్న కొందరు సీడ్స్ షాప్ యజమానులు గుట్టు చప్పుడు కాకుండా లాభార్జనె ధ్యేయంగా రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలను అంటగడుతు న్నారు.

**బిల్లు లేకుండానే రైతులకు విక్రయం..**

సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ కొనుగోలు సమయాలలో రైతులు తప్పనిసరిగా విత్తనాల షాపుల వద్ద బిల్లులు తీసుకోవాలని, ఎవరైనా సీడ్స్ షాప్ యజమానులు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే బిల్లు ఆధారంగా సీడ్ షాపును సీజ్ చేసి యజమాని పై కేసు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఖచ్చితంగా రసీదులు ఇవ్వాలని దుకాణాదారులకు సూచిస్తున్నా.. వారు పెడచెవిన పెడుతున్నారు. పలువురు దుకాణాదారులు ఉద్దెర పేరుతో.. రైతులకు మాయ మాటలు చెప్తూ.. బిల్లులు ఇవ్వకుండా విత్తనాలు అంటగడుతున్నారు. దీంతో విత్తనాలు వేసిన తర్వాత పంట చేతికి రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. విత్తనాలకు సంబంధించి న బిల్లు ఉంటే పంట చేతికి రాని సమయంలో రైతులకు న్యాయం జరుగుతుందని అధికారులు సూచిస్తున్నారు.

**తేదీ చూసి విత్తనాలు, మందులు తీసుకోవాలి**

జిల్లాలో కొన్ని విత్తనాల షాపులలో కాలం చెల్లిన విత్తనాలను, పెస్టిసైడ్స్ ను విక్రయిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రైతులు కొనుగోలు చేసే సమయంలో తేదీని తప్పనిసరిగా చూసి తీసుకోవాలని, గడువు ముగిసే సమయం 2/3 నెలలు మాత్రమే ఉంటే అట్టి విత్తనాలను, పెస్టిసైడ్స్ మందులను కొనుగోలు చేయరాదని, కాలం చెల్లిన విత్తనాలను విక్రయిస్తే అధికారులకు తెలియజేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

**సీడ్ షాపులపై పకడ్బందీ నిఘా కరువు..**

జిల్లాలో ఉన్న విత్తనాల షాపులపై వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన మందులు విక్రయించకుండా నిఘాను ఏర్పాటు చేసిన, విత్తనాల షాపు యజమానులు మాత్రం అధికారుల కళ్ళు కప్పి గుట్టు చప్పుడు కాకుండా మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వర్షాకాల సీజన్ సమయంలో వ్యవసాయ అధికారులు పగడ్బందీగా విత్తనాల షాపులపై నిఘా ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు జిల్లా కేంద్రంతో పాటు గ్రామాలలో రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా పగడ్బందీగా నిఘాను ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

### బిల్లు ఇస్తలే

**రైతు శ్రీనివాస్ రెడ్డి. భిక్కనూర్**



విత్తనాలు కొనుగోలు సమయాలలో సీడ్స్ షాప్ యజమానులు జీఎస్టీ తో కూడిన బిల్లులు ఇవ్వడం లేదు. వ్యవసాయ అధికారులు బిల్లు ఇవ్వని షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అడిగితే చిన్న చిట్టి మీద రాసిస్తున్నారు.

### బిల్లు ఇవ్వకుంటే సీడ్స్ షాప్‌లపై చర్యలు

**ఇన్‌చార్జి డీఏవోజీ వీరస్వామి**



జిల్లాలో ఉన్న సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ షాప్ నిర్వాహకులు రైతులు విత్తనాల కొనుగోలు సమయాలలో బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి. ఇదివరకే ఆదేశాలు జారీ చేశాం. బిల్లులు ఇవ్వకపోతే రైతులు మా దృష్టికి తీసుకురండి.. చర్యలు తీసుకుంటాం. బిల్లులు ఉంటే పంట నష్టం జరిగిన సమయంలో రైతులకు నష్టపరిహారం పొందడానికి ఉపయోగపడుతుందని సూచించారు.కాలం చెల్లిన మందులు విక్రయిస్తే షాప్ లైసెన్స్ రద్దు చేస్తాం.

# ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య సేవలు

- మద్దికుంట దత్తత.. ప్రతినెల ఒక ఆదివారం ఉచితంగా వైద్య సేవలు

**నవతెలంగాణ-రామారెడ్డి**



గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మండలంలోని మద్దికుంటలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కామారెడ్డి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలను గ్రామ సర్పంచ్ బొమ్మిడి రాంరెడ్డి, ఐఎంఏ అధ్యక్షులు వైద్యులు వెంకటేశ్వర గౌడ్, సెక్రటరీ వైద్యుడు నవీన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఆదేశానుసారం, " ఆవో, గావ్ చలో " కార్యక్రమాన్ని చేపట్టామని, కామారెడ్డి ప్రాంతంలోని మద్దికుంట గ్రామాన్ని దత్తత తీసుకొని, ఉచిత వైద్య సేవలు, ఉచిత మందులు అందజేస్తున్నామని, కామారెడ్డి పట్టణం లోని వివిధ ప్రముఖ ఆస్పత్రుల్లోని వివిధ స్పెషలిస్టులకు సంబంధించిన వైద్యులు ఉచితంగా వైద్య చికిత్సలు అందిస్తున్నారని, ప్రతి నెలలో ఒక ఆదివారం రోజు వైద్య సేవలు అందిస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవాలని సూచించారు.

సర్పంచ్ రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ఐఎంఏ నుండి వైద్య సేవలు అందించ డానికి మద్దికుంట గ్రామాన్ని దత్తత తీసుకొని, ఉచిత వైద్యం, మందులు అందజేస్తు న్నందుకు గ్రామ ప్రజల తరపున ఐఎంఏ వైద్య బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యుల బృందం, ల్యాబ్ టెక్నీషియన్, ఉప సర్పంచ్ నరేందర్, వీడీసీ చైర్మన్ గజ్జల శంకర్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లకు క్షమాపణలు చెప్పాలి

**నవతెలంగాణ-దోమకొండ**

ముదిరాజ్ జాతి వర్గంపై అనుచిత వాక్యాలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేయాలని దోమకొండ ముదిరాజ్ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. దోమకొండ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద మండల ముదిరాజ్ సంఘము పున్న లక్ష్మన్ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. సందర్భంగా ముదిరాజ్ సంఘము జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి, ముదిరాజ్ సంఘము అధ్యక్షులు పున్న లక్ష్మన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు బోయిని సత్యం, పున్న రాములు, నాగారపు రాములు, పుట్ట రమేష్, అబ్రబోయిన రాజు,కడారి రమేష్, సీతరం మధు, అసబోయిన శ్రీనివాస్,బాలయ్య, గరిగే సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బాలు

**నవతెలంగాణ-తాడ్వాయి**

తెలుగుదేశం పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ బాలును నియమించారు. రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పర్లపల్లి రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో టీఎన్ఎస్ఎఫ్ బలోపేతానికి, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మరింతగా పోరాటం చేస్తానని తెలియజేశారు.

## హైదరాబాద్ తరలిన గౌడ సంఘం నాయకులు



ఎల్లారెడ్డి నుంచి తరలిన గౌడసంఘం నాయకులు

**నవతెలంగాణ-మద్నూర్/ఎల్లారెడ్డి**

హైదరాబాద్‌లో గౌడ ఆత్మీయ భవన నిర్మాణం కోసం ఆదివారం భూమి పూజ కార్యక్రమానికి మద్నూర్ మండల గౌడ సంఘం నాయకులు తరలివెళ్లారు. నగరంలోని అత్యంత విలువైన కోకాపేటలో 5 ఎకరాల భూమిని గౌడ ఆత్మీయ భవన నిర్మాణానికి ప్రభుత్వం 5 కోట్ల రూపాయలు కేటాయించినట్టు నాయకులు తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్ క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక కృషితో భవనానికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. గీత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు మద్నూర్ మండల గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ కు తరలి వెళ్లిన వారిలో సలాబత్ పూర్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్, బి. శ్రీనివాస్ గౌడ్, యు. అశోక్ గౌడ్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేష్ గౌడ్, ప్రసాద్ గౌడ్, సాగర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**ఎల్లారెడ్డి :** హైదరాబాద్‌లో గౌడ ఆత్మీయ భవన నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమానికి ఎల్లారెడ్డి, లింగంపేట్ మండలాల గౌడ సంఘం నాయకులు ఆదివారం తరలివెళ్లారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో వెలుట్ల పేట రాజగౌడ్ మసగౌడ్ , భూపతిగౌడ్ రగవపల్లి, రాజగౌడ్ , రాజగౌడ్,లింగంపెట్ మండలం సంగన్న గారి రాజగౌడ్ ,భూమగౌడ్ కిష్ట గౌడ్ , గున్నల సత్యనారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

# మహిళా సంఘాల డబ్బులు రూ.37 కోట్లు స్వాహా

- వీవోఏ బాబాగౌడ్ నొక్కేసాడని మహిళల ధ్వజం
- అయినా చోద్యం చూస్తున్న అధికారులు
- సంఘాల సభ్యులు ఆందోళన చేస్తున్నా పట్టని వైనం
- అధికారుల హస్తం ఉందని ఆరోపణలు

**నవతెలంగాణ-తాడ్వాయి**



కలెక్టరేట్‌లో ధర్నా చేపట్టిన మహిళా సంఘాల సభ్యులు

రూపాయి రూపాయి పోగు చేసుకొని బ్యాంకులో కడుతూ.. రుణాలు పొందుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన పొందేందుకు ప్రయత్నిస్తే.. పలువురు అధికారుల, సిబ్బంది తీరుతో మొదటికే మోసం వస్తుంది. మహిళా సంఘాలు బ్యాంకులకు కట్టాల్సిన డబ్బులను ఏకంగా రూ.37 లక్షలు పక్కదారి పట్టించారు. అధికారుల అండతో వీవోఏ బాబాగౌడ్ డబ్బులను స్వాహా చేసినట్టు మహిళలు వాపోతున్నారు. తమ డబ్బులను తిరిగి రికవరీ చేయించాలని అధికారులకు మొర పెట్టుకున్నా.. ఆందోళనలు చేపట్టిన వారిని పట్టించుకునే వారు కరువైయ్యారు. వివరాల్లోకి వెళ్తే..

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడ గ్రామంలో మహిళా సంఘాల డబ్బులను స్థానికంగా వీవోఏగా పని చేస్తున్న బాబాగౌడ్ నొక్కేశాడని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం బహిరంగ విచారణలో వెల్లడయింది. అయినా అధికారులు రికవరీ విషయంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

**చోద్యం చూస్తున్న అధికారులు**

పక్క ప్రణాళికతోనే డబ్బులను దారి మళ్లించినట్లు తేలినా అధికారులు చోద్యం చూస్తున్నారు. వెంటనే వీఏవో ఆస్తులు జప్తు చేయించి డబ్బులు రికవరీ చేయాల్సి ఉండగా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. డబ్బులు రికవరీ చేయాలని మహిళా సంఘాల సభ్యులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అక్కడ రెండు గంటల పాటు ధర్నా చేపట్టి కలెక్టర్‌కు సైతం వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే రికవరీ చేయించాలని పీడీ సాయన్నను ఆదేశించారు. పీడీ సాయన్న గ్రామానికి అలా వెళ్లి ఇలా తిరిగి వచ్చారు.

**అధికారుల పాత్ర పై అనుమానాలు**

బహిరంగ విచారణలో డబ్బులు స్వాహా చేశారని తేలినా అధికారులు రికవరీ చేయడంలో జాప్యం చేస్తున్నారు. సదరు విఏఓ బాబా గౌడ్ తనను ఏం చేసుకుంటారో చేసుకోండి అన్న రీతిగా తప్పించుకు తిరుగుతున్నాడు. బాబాగౌడ్ ఎక్కడ ఉన్నా తీసుకు వచ్చి డబ్బులు రికవరీ చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ అధికారులు బాబాగౌడ్ లేడు కదా మేము ఏమి చేయాలి అంటూ వెళ్లిపోతున్నారని మహిళలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే డబ్బులు రికవరీ చేయించాలని మహిళలు డిమాండ్ చేశారు. లేని యెడల తమ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**వీవోఏ బాబాగౌడ్ ఇంటికి తాళం వేసిన మహిళలు**



వీవోఏ ఇంటికి తాళంవేసిన మహిళలు

తాడ్వాయి మండలం నందివాడ గ్రామంలో వివోఏ తాటిపాముల బాబా గౌడ్ ఇంటికి ఆదివారం మహిళా సంఘాల సభ్యులు తాళం వేశారు. ఇంట్లో ఉన్నవారిని బయటకు పంపించి తాళం వేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులు మాట్లాడుతూ.... తమ సంఘాలలో స్వాహా చేసిన సొమ్మంతా రికవరీ అయ్యే వరకు ఇంటికి వేసిన తాళం తీయబోమని హెచ్చరించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు బాబా గౌడ్ ఇంటిముందు బైఠాయించి నిరసన తెలిపినా ఏ అధికారి స్పందించలేదని మండిపడ్డారు. అనంతరం రాత్రి అక్కడే వంటావార్పు చేసుకుని భోజనం చేసి నిరసన తెలిపినా ఒక్క అధికారికైన చీమకుట్టినట్టు లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘాలలోని డబ్బులను దర్జాగా దోచుకున్నాడని విచారణలో తేలినా అధికారులు పట్టించుకోరా అంటూ తీవ్రంగా మండిపడ్డారు. తాము నెలనెలా సంఘంలో డబ్బులు జమ చేసుకొని ఆర్థికంగా బలోపేతం అవుదాం అనుకుంటే సంఘంలో విధులు నిర్వహిస్తున్న వివోఏ మాకు తెలియకుండా మా అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని డబ్బులను స్వాహా చేశారని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ కు వివరించినా కలెక్టర్ సైతం స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక కలెక్టరే స్పందించకుంటే తమ బాధను ఎవరికి తెలుపాలని బోరుమని విలపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మా డబ్బులు రికవరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

### వీఏవోతో బాండు రాయించడానికి ప్రయత్నించాం

**రవీందర్ రావు, ఏపీఎం తాడువాయి**

నందివాడ గ్రామ సంఘం వితఒ బాబాగౌడ్ నుంచి డబ్బుల రికవరీ కోసం బాండు రాయించడానికి శనివారం రోజంతా పీడి కార్యాలయంలో వేచి ఉన్నాం. కానీ బాబా గౌడ్ రాలేదు. ఆయన సాయంత్రం వరకు కూడా రాకుండా పోయాడు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తాం.

## నేడు మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

నేడు మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నిర్వహించడం జరుగుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనాలు పెట్టడానికి తమ ఆస్తులు తాకట్టుపెట్టి అప్పులు చేసి వంట చేసిన వాటికి సంబంధించిన ఖర్చులు 8 కోట్ల రూపాయలు చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కొత్త మెనూ అమలు చేయాలని కార్మికులపై ఒత్తిడి చేస్తు వారిని మరింత అప్పులపాలు చేసే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈనెల 26న సమ్మెకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులందరూ కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

## అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- ఎమ్మెల్సీ పదవి నుండి కౌశికారెడ్డిని తొలగించాలి

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కులం పేరుతో దూషించిన ఆయనను ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించాలని నిజామాబాద్ జిల్లా ముదిరాజ్ బంధువులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జిల్లాలోని అన్ని మండలాల్లో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నియోజకవర్గ ఇంచార్జీ, మండల అధ్యక్షులు, గ్రా పెద్దలు, అధ్యక్షులను అధ్యక్షులు కరాటే రమేష్ కుమార్ ముదిరాజ్ తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నిజామాబాద్ పక్షాన కోరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే నిరసన దీక్షలో ప్రతి ఒక్క ముదిరాజ్ బిడ్డ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# దళితబంధులో గోసంగిలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- గంధం రాజేష్

**నవతెలంగాణ-నవీపేట్**

దళిత బంధు పథకంలో గోసంగి లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు గంధం రాజేష్ అన్నారు. మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన నవిపేట్ పట్టణ గొసంగి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార సభకు ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు గంధం రాజేష్ హాజరై మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గోసంగి కులస్తులు ఏళ్లనాటి నుండి కళారూపాలతో వివిధ వేషధారణలతో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎస్సి కులానికి చెందిన వీరికి ఎస్సి ఫలాలు అందడం లేదని అన్యాయానికి గురవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో తమ కులవృత్తులు, వేషాధారణతో భాగస్వామ్యం అయి ఉద్యమ నాయకుడు కేసీఆర్ కి మద్దతుగా నిలిచామని తెలిపారు. ప్రత్యేక తెలంగాణలో తమ కులస్తుల జీవితాలు బాగుపడతాయని ఆశించామని కానీ రెండు పర్యాయాలు కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ గెలుపుకోసం తమ కుల సంఘాలన్ని ఏకగ్రీవ తీర్మానాలు చేసి ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామ్యం అయ్యామని తెలిపారు. అయినప్పటికీ గోసంగిలకు పార్టీలో గౌరవం లభించడంలేదని, సంక్షేమ పథకాల్లో, పదవుల్లో తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. గోసంగిల వెనుకబాటుకు ప్రభుత్వమే కారణమని సిఎం కేసీఆర్ స్పందించి ఆదుకోవాలని అన్నారు. ఎస్సిలో 57 ఉపకులాలు దయనీయ స్థితిలో తమ ఉనికిని కోల్పోతున్నాయని, అందులో గోసంగి కులం కూడా ఒకటని, చిత్తశుద్ధి ఉంటే గోసంగిలకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని తెలిపారు. నిజమాబాద్ జిల్లాలో గోసంగి ఆత్మగౌరవ భవనానికి ఒక ఎకరం భూమితో పాటు నిర్మాణానికి కోటి రూపాయల నిధులు కేటాయించాలని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 200 తగ్గకుండా దళితబంధు, డబుల్ బెడ్ రూమ్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సి ఉప కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నిరగొండ బుచ్చన్న, గోసంగి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఈర్నాల లక్ష్మణ్, జిల్లా కోశాధికారి ఈర్నాల వెంకటరమణ, కళ్లెం గంగాధర్, బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు కొండపల్లి గంగాధర్, జివైఎస్ నాయకులు రెవల్లి సాయిలు పాల్గొన్నారు. నవీపేట్ పట్టణ కమిటీ అధ్యక్షులుగా ఈర్నాల రాములు, ప్రధానకార్యదర్శిగా గంధం అశోక్, ఉపాధ్యక్షులుగా కొండపల్లి శంకర్, కోశాధికారిగా కళ్లెం గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా ఇర్నాల చిన్న సాయిలు, ప్రచార కార్యదర్శిగా ఇర్నాల సత్యనారాయణ, ముఖ్య సలహాదారులుగా ఈఎం.గంగాధర్, ఈ. సాయిలు, గంధం శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు రాజేష్

## కొమ్మలే కాదు.. చెట్లు ఆటంకమా..



కాండం వరకు చెట్టును నరికేసిన దృశ్యం

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగలకు ఆటంకం కలిగించే చెట్ల కొమ్మలను తీసేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్న చెట్లను కూడా కాండం వరకు తొలగించడం ఎంతవరకు సరియైనదని నగర ప్రజలు అంటున్నారు. ఒకవైపు పొల్యూషన్ పెరుగుతుంటే మరోవైపు ఉన్న చెట్లను తీసేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. శివాజీ నగర్ ప్రాంతంలో విద్యుత్ శాఖ అధికారులు నెలవారీ విద్యుత్ మరమత్తులో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చెట్టును కాండంవరకు తొలగించారు.

## ఆలీసాగర్‌లో బాలుడి మృతదేహం లభ్యం



నీటిపై తేలిన బాలుని మృతదేహం

**నవతెలంగాణ-ఎడపల్లి**

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట గ్రామంలోగల బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన ఉన్న అశోక్ సాగర్ చెరువులో గల్లంతైన బాలుడి మృతదేహం శనివారం సాయంత్రం.లభ్యమైంది. శుక్రవారం ఇద్దరు అక్కాచెల్లెల్లు తమ ముగ్గురు పిల్లలతో కలిసి అశోక్ సాగర్ చెరువులో దూకి ఆత్మహత్యయత్నం చేశారు. అయితే అదే సమయంలో వాహనంలో రహదారి వెంట వెళ్తున్న యువకుడు గమనించి వెంటనే ఇద్దరు మహిళలతో పాటు ఇద్దరు చిన్నారులను బయటకు తీసి వారి ప్రాణాలను కాపాడాడు.. అయితే ముగ్గురు పిల్లల్లో భవేష్ అలియాస్ వందు అనే 5ఏండ్ల బాలుడు నీట మునిగి గల్లంతయ్యాడు. పోలీసులు అక్కడే ఉండి బాలుడికోసం చెరువులో గజ ఈతగాళ్ళతో గాలించిన బాబు దొరకలేదు. శనివారం ఉదయం కేజీ ఫిష్ బాక్స్‌ల మధ్య మతదేహం తేలియాడుతుండటం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మతదేహాన్ని బయటకు తీసి పోస్ట్ మార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ అసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నిజామాబాద్ ఆరవ టౌన్ ఎస్ఐ సాయి కుమార్ తెలిపారు

## మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు సిపిఐ మద్దతు

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**





మాట్లాడుతున్న నాయకులు సుధాకర్

మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఐ మద్దతు తెలుపుతున్నట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త సంవత్సరం మొదలైనా పెండింగ్లో ఉన్న 8 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకుండా, ఈ విద్యా సంవత్సరం కొత్త మెనూ ప్రకారం రాగిసంకటి, కిచిడి, ఇతర ఆహార పదార్థాలు విద్యార్థులకు అందిస్తామని ప్రభుత్వం చెబుతోందన్నారు. కార్మికులకు చెల్లిస్తానన్న 3000 రూపాయలు చెల్లించలేదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తామని అన్నారు. సమావేశంలో నాయకులు సాయిలు, రాజలింగం, శివ, రాజు పాల్గొన్నారు.

## రోడ్లపై కేజీవీల్స్ నడిపితే చర్యలు

**నవతెలంగాణ-ముప్కాల్**

ప్రధాన రోడ్లపై కేజీవీల్స్ నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ భాస్కరా చారి తెలిపారు. ఆదివారం ఆయన లేకరుల సమావేశంలో మాట్లాడుతూ ట్రాక్టర్ యజమానులు నియమ నిబంధనలను పాటిస్తూ ట్రాక్టర్లను రోడ్లపై నడపాలని అన్నారు. రైతులకు అవసరం ఉన్న చోట వ్యవసాయ భూముల వద్ద కేజీవీల్స్ ను బిగించి పనులు చేసుకోవాలని సూచించారు. ప్రధాన రోడ్లపైన కేజీవీల్స్‌తో నడిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ట్రాక్టర్ యజమానులు గ్రహించాలని కోరారు. ఎవరైనా ట్రాక్టర్ యజమానులు కేజీవీల్స్ తో రోడ్లపైకి వస్తే సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. 9490618032 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

## మామిడిపల్లిలో బోనాల సంబరాలు



ఆర్మూర్ : మామిడిపల్లిలో బోనాలతో వస్తున్న గ్రామస్తులు

**నవతెలంగాణ-ఆర్మూర్/ఎడపల్లి**

పట్టణ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి పండగ నిర్వహించారు. అన్ని కులాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బోనాలు తీసి నైవేద్యం సమర్పించారు వలగొడుగు బోనాలతో మహిళలు అన్ని కులసంఘాల సభ్యులు వీడీసీ భవనం నుండి పోచమ్మ గుడి వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంట పశువులు పిల్ల జెల్ల సుఖసంతోషంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల రాము, రవిగౌడ్, కాశీరాం, వీడీసీ సభ్యులు మనీష్ చారి, మేడిదల ప్రవీణ్ గౌడ్, లక్కారం నరేష్, సల్ల చిన్న రాజన్న, తూర్పు రాజన్న, చిట్ల సవీన్, నరేందర్ వర్మ, వడ్ల ప్రణీత్, గోవర్ధన్, సాయిరాం, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

**ఎడపల్లి:** మండలంలోని వడ్డేపల్లి, జమలం గ్రామాల్లో బోనాల పండుగ నిర్వహించారు. డప్పు వాయిద్యాల గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.క సమృద్ధిగా వర్షాలు కురవాలని పాడిపంటలు భోగభాగ్యాలు వర్ధిల్లాలని , ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ గ్రామదేవతలకు బోనాలతో నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను సీఎం కేసీఆర్ గుర్తించాలి

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తప్పకుండా గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ ఉద్యమకారుడు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా నుండి తెలంగాణ ఉద్యమకారులు ఎంతోమంది ఉన్నారని, తెలంగాణ దశాబ్ది ఉత్సవంలో ఉద్యమకారులను మరిచిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమంలో లేని వారిని నామినేటెడ్ పోస్టులను అలాగే ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలుగా నియమిస్తూ వత్తాసు పలుకుతున్నాడని తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని సీఎం కేసీఆర్ ఎందుకు మర్చిపోయారని నిలదీశాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఏఎస్ పోశెట్టి, బాబు రెడ్డి, సైకిల్ నర్సయ్య, గిరిధర్ యాదవ్ తో పాటు తదితరులను గుర్తు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో తమపై ఎన్నో కేసులు నమోదు చేసిన పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగిన పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఉద్యమకారులను గుర్తించాలని కోరారు.

# చలో ఈఎన్‌సీని జయప్రదం చేయండి

- ఐఎఫ్‌టీయూ

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

మిషన్ భగీరథ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న జేఏసీ ఇచ్చిన చలో ఈఎన్‌సి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు.నగరంలోని శ్రామిక భవన్, కోటగల్లి లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సుధాకర్ మాట్లాడుతూ మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, తక్షణమే జీవో నెంబర్ 60 ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతన పెంపుతో పాటు వారి ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని ఈనెల 27న హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోగల ఇఎన్‌సి (ఇంజనీరింగ్ ఇన్ చీఫ్) కార్యాలయం ముట్టడి నిర్వహిస్తున్నామని తెలిపారు. జి.ఓ.నెం.60 ప్రకారం స్కిల్డ్ ఉద్యోగులకు రూ.22,750, సెమీ స్కిల్డ్ ఉద్యోగులకు రూ.19,500, అన్ స్కిల్డ్ ఉద్యోగులకు రూ.15,600 వేతనాన్ని అమలు చేయాలని అన్నారు. పీఎఫ్, ఇయస్ఐ, బోనస్ అమలు చేయాలని తెలిపారు. వారాంతపు సెలవులు, పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు ఇవ్వాలని అన్నారు. వాల్వ్ ఆపరేటర్లకు టీఏ ఇవ్వాలన్నారు. ప్రతి నెల సకాలంలో వేతనాలు ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని మిషన్ భగీరథ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొ ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు కిరణ్, విటల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్

# అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**నవతెలంగాణ-ఆర్మూర్**



పట్టణ అంగన్వాడి ప్రాజెక్టులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అధ్యక్షురాలు పి. చంద్రకళ ఆదివారం తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో రేషన్ డీలర్ నుండి బియ్యం తీసుకువచ్చిన హమాలి డబ్బులు మూడు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్నాయని,, సెంటర్‌కు వంట పాత్రలు చాలా రోజుల క్రితం ఇచ్చినవి పూర్తిగా పాడైపోయాయని, కొత్త వాటిని ఇప్పించాలని అన్నారు. కార్గో బస్సు ద్వారా వచ్చే ఫుడ్ సెంటర్ కి రావడం లేదని, వేరే వాహనం ద్వారా ఫుడ్ సెంటర్‌కు చేరే విధంగా వేరే వాహనం ఏర్పాటు చేయా లని తెలిపారు. ఏడుడు సంవ త్సరాల ను ండి పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ బిల్లుల బకా యిలు చెల్లించాలని కోరారు. సెంటర్‌కు కావలసిన రిజిస్టర్స్ అన్ని చార్జెస్ ఇప్పించాలని, ఆరోగ్య లక్ష్మి ప్రారంభం అయినప్పటి నుండి ఇస్తున్న కూరగాయల బిల్లులు పాత బిల్లులు ఇస్తున్నారని, ధరలకు అనుగుణంగా పెంచాలని తెలిపారు. బీఎల్ఓ డ్యూటీల నుండి టీచర్స్‌ని మినహాయించాలని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,, కోడి గుడ్ల నిల్వలకోసం జాలీ బాక్సులు ఇవ్వాలని, ఇన్చార్జి సెంటర్ చేసే టీచర్స్‌కి అలవెన్స్ ఇవ్వాలని, టీచర్లందరికీ పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు.

# మంత్రి సవాల్‌కు నేను సిద్ధం

- ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి

**నవతెలంగాణ-మోర్తాడ్**

వందల కోట్ల రూపాయల కాంట్రాక్ట్ ఇచ్చే హక్కు మంత్రికి ఎక్కడిది.. ఈ విధంగానే ఒకే వ్యక్తికి కాంట్రాక్టర్లు కట్టబెట్టడం ప్రజాధనం దుర్వినియోగం చేయడం మంత్రికి అలవాటు అని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ విషయమై బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని.. మంత్రి కూడా సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరాడు. మండలకేంద్రంలోని ప్రజానిలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపం, అవినీతి జరిగిందని చూపెడితే వందకోట్ల రూపాయల కాంట్రాక్టు ఇస్తానంటూ సవాల్ విసిరిన మంత్రి ఒకే వ్యక్తికి వంద కోట్ల కాంట్రాక్టు ఇచ్చే హక్కు ప్రశాంత్ రెడ్డికి ఎక్కడిదని అన్నారు. దౌర్జన్యంగా మంత్రి ఒకే వ్యక్తికి కాంట్రాక్టర్లు అప్పజెప్పి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కూడబెట్టుకుంటున్నాడని అన్నారు. మంత్రిని కాదని కాంట్రాక్ట్ వేసిన పనులు చేయకుండా, బిల్లులు రాకుండా రౌడీయిజం చేయడం మంత్రికి అలవాటు అని విమర్శించారు. తనకు సంబంధించిన ఒకే వ్యక్తికి కాంట్రాక్టర్లు ఇప్పించడం మంత్రికి అలవాటుగా మారి కోట్ల రూపాయలను ప్రజాధనం దోచుకుంటున్నారని అన్నారు. 10 కోట్ల రూపాయలు దాటిన టెండర్లను కమిషనర్ ఆఫ్ టెండర్సు పంపాలని తెలిపారు. కానీ తన బంధువులకు టెండర్లను అప్పజెప్పడం ఎంతవరకు సబబు అని అన్నారు. చెక్ డ్యాములు కూలి భూములు కోల్పోయిన రైతు సమస్యలు పట్టించుకోవడంలో, పంట భూములు కోల్పోకుండా నిర్మాణం చేయాల్సిన కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహించారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో గంజాయిని విక్రయిస్తూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న వాటిపై ఎందుకు ప్రశ్నించడం లేదని, నామమాత్రపు వ్యక్తులను పట్టుకొని అసలు దోషులను మాత్రం ఎందుకు పట్టుకోవడం లేదని ప్రశ్నించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న గంజాయి రవాణా అసలు సూత్రదారులు మంత్రికి తెలియదా.. అని ప్రశ్నించారు. నామమాత్రంగా పోలీసుల సమావేశం ఏర్పాటు చేసి నియోజకవర్గంలో ఒకేసారి మూడు నాలుగు చోట్ల గంజాయి సేవిస్తున్న వ్యక్తులను పట్టుకొని కేసులు నమోదు చేసి మంత్రి చెప్పిన విధంగా చర్యలు తీసుకోవడమే తప్ప అసలు దోచులను మాత్రం పట్టుకోవడంలో ప్రయత్నాలు చేయించడం తెలిపారు. వీటిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని మంత్రికి సవాల్ విసిరాడు. సమావేశంలో సునీల్ యువసేన నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సునీల్‌కుమార్‌రెడ్డి

# గ్రీన్ లాండ్స్ కమ్యూనిటీలో శ్రమదానం

**నవతెలంగాణ-బోధన్**

బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లిలోగల గ్రీన్ ల్యాండ్స్ కమ్యూనిటీలో ఆదివారం కాలనీవాసులు శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ ఆహ్మద్ పాల్గొని మాట్లాడారు. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పరిసరాలను శుభ్రపరుచుకోవడం అభినందనీయం అన్నారు. తడి, పొడి చెత్తను అవగాహన, పర్యావరణానికి హాని కలిగించే చెత్తల ట్రీట్ మెంట్ స్వయంగా చేసుకోవడానికి త్వరలోనే అవగాహన సదస్సును నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కమ్యూనిటీలోని పార్కు, కామన్ ఏరియాలను శుభ్రం చేశారు. కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. త్వరలో హరిత హారం కార్యక్రమాన్ని చేపడతామని సహకార సొసైటీ కార్యదర్శి నగేష్ బాబు తెలిపారు. అడ్వొకేట్ ఇంద్రకరణ్ మాట్లాడుతూ కమ్యూనిటి ప్రజలకు అండగా ఉంటామని చేపట్టబోయే కార్యక్రమాలకు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్, వెంకటేశ్వర రావు, కృష్ణ, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, నాగార్జున్ గౌడ్, లక్ష్మణ్, హేమంత్, రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.



గడ్డిని తొలగిస్తున్న కాలనీవాసులు

## యోగ ప్రభాకర్‌కు పరామర్శ

**నవతెలంగాణ-కంఠేశ్వర్**



పరామర్శిస్తున్న ఆకుల లలిత

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ యోగ ప్రభాకర్ సోదరుడు మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను టీఎస్‌డబ్ల్యూ సి డి సి చైర్ పర్సన్ ఆకుల లలిత రాఘవేందర్ ఆదివారం పరామర్శించారు. ఆమెతోపాటు మాజి మేయర్ ఆకుల సుజాత, బంటు నిర్మల, ఆకుల కవిత పంచారెడ్డి అనిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ధర్మారంలో మెగా హెల్త్ క్యాంప్



**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో సూర్య ఆరోగ్య సంస్థ, తెలంగాణ కమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం అయ్యింది. ఈ శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుదర్శనం హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత మెగా హెల్త్ శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. స్త్రీల ఆరోగ్య సమస్యలు, గుండె నరాలు, చెవి, ముక్కు, గొంతు, దంత, ఎముకలు, కీళ్ల సమస్యలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించటంతో సుమారు 500 వరకు పరీక్షలు చేసుకున్నారని తెలంగాణ కమ్మ సంఘ అధ్యక్షులు డాక్టర్ గోపాలం విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రచన, సందీప్ రావు, దత్తురాజ్, కృష్ణ ఆధిత్య, ఆలోక్, ప్రవీన్ కుమార్, దీపక్ రాథోడ్, లక్ష్మణ్ గోయపాటితో పాటు సూర్య ఆరోగ్య సంస్థ, తెలంగాణ కమ్మ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ప్రతినిధులు గుర్రపు శేఖర్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను అసభ్య పదజాలంతో దూషించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కౌశిక్ రెడ్డి వెంటనే ముదిరాజ్ లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, ముదిరాజ్ లతో పెట్టుకుంటే సహించేది లేదన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు శేఖర్, కిషన్, ప్రశాంత్, స్వామి, కిరణ్, నాగరాజు, మెంట్రాట్పల్లి ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.